క్లుప్తంగా

మహిళలకు ఆటల పోటీలు



ఆటలాడుతున్న మహిళలు

నెన్నెల: మండల కేంద్రంలోని మదర్ థెరిస్సా చర్చి ప్రాంగణంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం మహిళలకు ఆటల పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఫాదర్ ప్రభాకర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి ఫ్లైఓవర్ బ్రిడ్జి పక్కన కైలాసగిరి కాలనీలో గల గౌతం రాజేశ్వరి చారిటబుల్ ట్రస్టు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు డైరెక్టర్ సరిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 15వ తేదీలోపు తమను 99895 27152 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్టాపన



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

చెన్నూర్: చెన్నూర్ జగన్నాథాలయంలో ధ్వజస్తంభం, హనుమాన్, గాలిదేవుని విగ్రహ ప్రతిష్ఠాపన కనుల పండువగా నిర్వహించారు. తిరుమల తిరుపతికి చెందిన వేద పండితుల మంత్రోచ్ఛారణలు, వేలాది మంది భక్తుల మధ్య ఆలయ అర్చకులు దామెర మోహనాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభం, విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అనిలాచార్యులు, అజయ్ ఆచార్యులు, వేద పండితులు పాల్గొన్నారు.

ఘనంగా సప్తాహం

భీమిని: మండలంలోని మల్లీడిలోని శివ పంచాయతన ఆంజనేయస్వామి వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో సప్తాహం (ఏడు రోజుల భజన) కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ నెల 16వ తేదీ వరకు జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్ అమలు చేయాలి

కాసిపేట: ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జి దాగం మల్లేష్ డిమాండ్ చేశారు. సోమగూడెంలో ఈ నెల 10, 11, 12తేదీల్లో వేములవాడలో నిర్వహించే రాష్ట్ర సమావేశాల కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. సమావేశాలను విజయవంతం చేయాలని, దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జాడి పోశం, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి లక్ష్మణ్, నాయకులు దుర్గం సుధాకర్, మామిడి గోపి, శ్రీనివాస్, రాకేష్, రాయమల్లు, సతీష్ తదితరులున్నారు.

'చలో ఢిల్లీ' కరపత్రాల ఆవిష్కరణ

భీమారం: ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 11న నిర్వహించే చలో ఢిల్లీ కరపత్రాలను ఆదివారం మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి సన్నీగౌడ్ ఆవిష్కరించారు. పార్లమెంట్ ముట్టడికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. నాయకులు సుమంత్, సిద్దార్థ, సంజీవ్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గుట్టలు గుల్ల.. పర్యవేక్షణ డొల్ల!



దండేపల్లి: మండలంలోని రెబ్బనపల్లి శివారు గుట్ట ప్రాంతాల్లో గల ప్రభుత్వ, లావణి పట్టా భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు గుట్టుగా గుట్టల్లో మొరం తవ్వకాలు జరుపుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఎత్తయిన గుట్ట ప్రదేశాలు నేలమట్టమవుతున్నాయి. ఇటీవల కొందరు అనుమతులు తీసుకొని తవ్వకాలు చేపట్టినా, వారి అనుమతి గడువు ముగిసింది. అయినా మరికొందరు అదే ప్రదేశంలో, దానికి కొంత దూరంలో జేసీబీలతో మొరం తవ్వకాలు చేస్తున్నారు. ఎవరికి చిక్కకుండా ఉండేందుకు మొరం తవ్వకాలు రాత్రి వేళల్లో చేపట్టడుతున్నట్లు సమాచారం. అధికారులు దృష్టిసారించి మొరం అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయపై తహసీల్దార్ సంధ్యారాణిని సంప్రదించగా గత నెల 26వరకు కొందరు అనుమతి తీసుకొని తవ్వకాలు జరిపారు. ఆ తర్వాత మళ్లీ ఎవరు అనుమతి తీసుకోలేదు. అనుమతి లేకుండా మొరం తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామన్నారు.

జల పుష్పాలవేట

నెన్నెల: మండల కేంద్రంలోని దశలి కుంట వద్ద గంగపుత్రులు ఆదివారం చేపలు పట్టగా జనం సందడి చేశారు. కొనుగోలు చేసేందుకు ప్రజలు పోటీ పడ్డారు. 3క్వింటాళ్ల చేపలు కేవలం గంటలోనే అమ్ముడయ్యాయి.



పల్లెల్లో జాజిరి సందడి



నెన్నెల/దండేపల్లి: పల్లెల్లో పిల్లలంతా సంతోషంగా ఆడుకునే జాజిరి ఆటలు ప్రారంభమయ్యాయి. కాముడి పున్నమి పురస్కరించుకొని హోలీ పండుగకు ముందు వారం రోజుల పాటు గ్రామాల్లో చిన్నారులు కోలలను లయబద్ధంగా కొట్టుకుంటూ జాజిరిపాటలు పాడుతూ వెన్నెల వెలుగులో రాత్రిపూట ఉత్సాహం కనబరుస్తున్నారు. అమావాస్య రోజు జాజిరి కోలలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే కామదహనంలో వేసి దహనం చేస్తారు.

సాయంకాలం భానుడి అందం

జన్నారం: సాయంకాలం, సూర్యుడు పశ్చిమాన అస్తమించేందుకు వెళుతున్నాడు. ఎర్రని రంగులో దట్టమైన చెట్ల మధ్యన అందమైన సూర్యబింబం చూపరులను కనువిందు చేస్తోంది. అందమైన దృశ్యం జన్నారం అడవుల్లో ఆవిష్కృతం కాగా, ప్రముఖ వైల్డ్‌లైఫ్ ఫోటోగ్రాఫర్ శ్యాంసుందర్ తన కెమెరాలో బంధించారు.



నీళ్లు తగ్గి.. రోడ్డును తలపిస్తూ!

దండేపల్లి: ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి మట్టం క్రమక్రమంగా తగ్గుతోంది. దీంతో దండేపల్లి మండలం గూడెం సమీపంలో నీటమునిగిన గోదావరినదిపై గల పాత లోలెవల్ వంతెన కొంచెం పైకి తేలింది. వంతెనకు ఇరువైపులా గల రక్షణ దిమ్మెలు కనిపిస్తుండటంతో దూరం నుంచి అటువైపు చూస్తే మాత్రం నదిమధ్యలోంచి రోడ్డు ఉన్నట్టుగా కనిపిస్తోంది. రోడ్డనుకుని అటుగా వెళ్తే నీటమునగడం కాయం. భక్తులు జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.



ఎడారిలా బృహత్ వనం!



భీమారం బృహత్ ప్రకృతివనంలో ఎండిన మొక్కలు

- 20వేల మొక్కలకు మిగిలింది మూడు వేలు
- నిరుపయోగంగా బోరు, పైప్‌లైన్
- పట్టించుకోని అధికారులు

భీమారం: చెన్నూర్ నియోజకవర్గంలోనే ఆదర్శంగా ఉండాలనే ఉద్దేశంతో నాలుగేళ్ల క్రితం మండల కేంద్రంలో 10 ఎకరాల భూమిలో ఏర్పాటు చేసిన బృహత్ ప్రకృతివనం ఎడారిలా మారింది. మొక్కలకు నీరందించడంలో అధికారులు విఫలం కావడంతో 20వేల మొక్కలకు కేవలం 3వేల మొక్కలు మాత్రమే మిగిలాయి. గత ప్రభుత్వం హయాంలో ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనం, మండల కేంద్రంలో బృహత్ ప్రకృతి వనం పేరుతో పెద్దఎత్తున మొక్కలు నాటారు. అందులో భాగంగా మండల కేంద్రం సమీపంలోని 138 సర్వే నంబర్‌లో 10 ఎకరాల భూమిని వనం కోసం ప్రభుత్వం కేటాయించింది. ఈమేరకు ఈజీఎస్ నిధుల ద్వారా భూమిని చదును చేశారు. అనంతరం అప్పటి అటవీశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వవిప్ బాల్కసుమన్ చేతుల మీదుగా మొక్కలు నాటించారు. మొక్కలను రక్షించేందుకు ఉపాధి నిధుల ద్వారా బోరు బావి వేసి అక్కడ నుంచి 10 ఎకరాల్లో నాటిన మొక్కలకు నీరందించేందుకు పైపులైన్లు కూడా వేశారు.

మొక్కలు నాటారు.. నిర్వహణ మరిచారు..

మొక్కలు నాటిన అనంతరం మొక్కలకు నీరందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కానీ కొన్నాళ్ల తరువాత బృహత్ పల్లెప్రకృతి వనం పట్టింపు లేకుండా పోయింది. దీనితో మొక్కలకు నీరు సక్రమంగా అందక మొక్కలు ఎండిపోయే దశకు చేరుకున్నాయి. అయినా అధికారులు అటువైపు వచ్చే పరిస్థితి కూడా లేకపోవడంతో వేల సంఖ్యలో మొక్కలు ఎండిపోయాయి.

నిర్వహణ గ్రామపంచాయితీకి..

మొదట ఈజీఎస్ నిధుల ద్వారా మొక్కలు నాటడంతో పాటు నిర్వహణ చేపట్టిన ప్రభుత్వం కొన్ని నెలల అనంతరం ఈజీఎస్‌ని తప్పించి గ్రామపంచాయితీకి బాధ్యతలు అప్పగించింది. కాగా బృహత్ పల్లె ప్రకృతివనంపై అధికారులు నిర్లక్ష్యం వహించడంతో అందులో నీటిసరఫరా కోసం ఏర్పాటు చేసిన కొన్ని పైపులను దొంగలు ఎత్తుకెళ్లారు. పైపులైను ద్వారా ఏర్పాటు చేసిన నల్లాల్లో ఇప్పుడు కొన్ని మాత్రమే మిగిలాయి. ఇక ప్రత్యేకంగా వేసిన బోరుబావి ఇతర పనులకు వినియోగిస్తున్నారు. పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం లక్షలాది రూపాయలు వ్యయం చేసి మొక్కలు నాటించిన వాటిని కాపాడడంలో అధికారులు విఫలం చెందారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి



పచ్చదనం పెంచేందుకు నాటిన మొక్కలను కాపాడడంలో నిర్లక్ష్యం చూపిన అధికారులపై చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం కూడా శ్రద్ధ చూపి తిరిగి మొక్కలు నాటించాలి.

– నాగభూషణ్, భీమారం

నిధులు లేవు..



బృహత్ పల్లెప్రకృతి వనాలతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలకు నీటిని అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం లేదు. దీనితో నీటి సరఫరా నిలిచిపోయింది.

– మధుసూదన్, ఎంపీడీవో, భీమారం

దళిత సంఘాల ఐక్యవేదిక నాయకుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలం నగునూర్ గ్రామంలో బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించడాన్ని నిరసిస్తూ ఆదివారం బెల్లంపల్లిలో దళితసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కాంటా చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి శుద్ధి చేశారు. రోడ్డుపై బైఠాయించి వాహనాల రాకపోకలు నిలువరించారు. అంబేడ్కర్‌ను అవమానించిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునఃరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు చిలుక రాజనర్సు, ప్రధాన కార్యదర్శి గోమాస రాజం, ముఖ్య సలహాదారు మాసం మురళీ, నాయకులు రాజ్‌కుమార్, నర్సయ్య, మల్లేష్, నారాయణ, రాజనర్సు, రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎంఎస్ నూతన కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులతో రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా హెచ్‌ఎంఎస్ నూతన బ్రాంచ్ కమిటీని ఆదివారం నస్పూర్ కాలనీలోని ఆ యూనియన్ కార్యాలయంలో ఎన్నుకున్నారు. బ్రాంచ్ కార్యకర్తల సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఆ యూనియన్ వేజ్‌బోర్డ్ సభ్యుడు, రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల సాధనలో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పోరాడాలన్నారు. గనులపై యూనియన్ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు. నూతన కమిటీలో ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షుడిగా అనిల్ రెడ్డి, కార్యదర్శిగా పొన్నగంటి అశోక్ కుమార్, కోశాధికారిగా మీస కొమురయ్య, ఏరియా చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా దుర్గం లక్ష్మణ్, యూత్ ఆర్గనైజింగ్ సెక్రెటరీగా కంకణాల రంజిత్ కుమార్, సహాయ కార్యదర్శులుగా పది మందిని, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శులు, కమిటీ సభ్యులుగా, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా మొత్తం 70మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇదివరకు పనిచేసిన బ్రాంచ్ ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్యను సారాయణం సెంట్రల్ కమిటీలో తీసుకోబోతున్నట్లు రియాజ్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో ఆ యూనియన్ నాయకులు గొల్ల సత్యనారాయణ, బోనాల శ్రీనివాస్, కంబాల నరసయ్య, దుర్గం వెంకటేశ్వర్లు, జీవన్, పల్లె క్రాంతికుమార్ పాల్గొన్నారు.

యూనియన్ బలోపేతానికి కృషిచేయాలి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్: యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వేజ్ బోర్డులో బీఎంఎస్ కృషి ఫలితంగానే కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం జరిగిందని పేర్కొన్నారు. అనేక సమస్యల పరిష్కారానికి యూనియన్ కృషి చేసిందని ఈ విషయాన్ని కార్మికుల్లో తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏబీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి మాధవ్ నాయక్, జాతీయ నాయకులు మంద రమాకాంత్, పులి రాజిరెడ్డి, సింగరేణి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వై.సారంగపాణి, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, నాయకులు రాగం రాజేందర్, రమేశ్, గుర్రం ప్రదీప్, గూడ శ్రీకాంత్, బొంపల్లి రమేశ్, జల తిరుపతి, బుర్ర అరుణ్‌గౌడ్ పాల్గొన్నారు.

వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

- పరారీలో ఒకరు
- వెల్లడించిన ఏసీపీ ప్రకాశ్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలక్రైం: ప్రజలను బెదిరించి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ ఆర్.ప్రకాశ్ తెలిపారు. మంచిర్యాలలోని ఆయన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. సీసీసీ నస్పూర్ ఫ్లడ్ కాలనీకి చెందిన ఎండీ.నయిమ్ పాష, శ్రీరాంపూర్ కాలనీకి చెందిన కొంటు రాజేందర్, మంచిర్యాలకు చెందిన నల్ల నాగేంద్ర ప్రసాద్ కొంతకాలంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పతున్నారు. ఎండీ నయీంపాష ప్రస్తుతం ఆమ్‌ఆద్మీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, గతంలో రిపోర్టర్‌గా పనిచేశాడు. ఎమ్మెల్యే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా పోటీచేసి ఆర్థికంగా నష్టపోయాడు. సులువుగా డబ్బులు సంపాదించాలనే తపనతో తన స్నేహితులైన నాగేంద్రప్రసాద్, రాజేందర్‌తో దందాలకు పాల్పడేవాడు. గతనెల 27న రాయల్ టాకీస్ వద్ద హరిహర టీ స్టాల్ యజమాని రావిపాటి అన్వేష్‌ను బెదిరించి ఆయన సెల్‌ఫోన్ నుంచి రూ.10వేలు ఫోన్ పే చేయించుకున్నారు. రూ.10లక్షలు ఇవ్వాలని తీగల శివకుమార్‌ను గత డిసెంబర్ 18న బెదిరించి దాడికి పాల్పడ్డారు. శివకుమార్, అన్వేష్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులపై ప్రత్యేక నిఘా పెట్టామని, ఆదివారం నయిమ్‌పాషా, నాగేంద్రప్రసాద్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. రాజేందర్ పరారీలో ఉన్నారన్నారు. సమావేశంలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, ఎస్సై సుగుణాకర్ పాల్గొన్నారు.

బియ్యం లారీ దొంగలు ముగ్గురు...

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని సురభి లాడ్జ్ వద్ద బియ్యం లోడుతో పార్కింగ్ చేసిఉన్న లారీ ఈ నెల 1న చోరీకి గురైంది. ఈ ఘటనలో నిందితులను ఆదివారం పట్టుకొని బియ్యం, లారీని స్వాధీనం చేసుకొని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఏసీపీ ప్రకాశ్ తెలిపారు. లారీ యజమాని అగ్గదేవారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని పాత మంచిర్యాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ఆటోలో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. క్యాతన్‌పల్లికి చెందిన దావనపల్లి వెంకటేష్(లారీ డ్రైవర్), దొర్లబంగ్ల ఏరియాలోని కళ్యాణిఖనికి చెందిన తంగళ్లపల్లి రమేశ్ బియ్యం లారీని ఎత్తుకెళ్లి హాజీపూర్‌కు చెందిన వానరాసి సంపత్‌కు బియ్యం విక్రయించారు. లారీని, ఓ ఆటోను పట్టుకొని జగిత్యాల వైపు వెళ్లి ఓ నిర్మానుష్యమైన ప్రాంతంలో దాచి ఉంచారు. లారీని విక్రయించేందుకు ప్రయత్నించారు. ఆదివారం మహారాష్ట్రకు వెళ్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యం, లారీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వెంకటేష్, సంపత్, రమేష్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి లారీ, డుప్లికేట్ కీ, ఐచర్ వ్యాన్, ఆటో, 360బాయిల్డ్ రైస్ బ్యాగులు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ ప్రమోద్‌రావు, ఎస్సై ప్రవీణ్‌కుమార్, స్పెషల్ పార్టీ సిబ్బంది సుబ్బారావ్, మహేష్, సహకరించిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

కార్యవర్గాలు

పాతమంచిర్యాల: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్వరీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యక్షురాలిగా సోమిడి సమ్మక్క, ప్రధాన కార్యదర్శిగా సామల ఉమారాణి, ఉపాధ్యక్షురాలిగా బోగే నాగజ్యోతి, కార్యదర్శులుగా ఎం.డి రఫియా, వి.నిర్మల, కమిటీ సభ్యులుగా ప్రమీలా, రేణుక, పద్మ, సరిత, తిరుపతమ్మ, శిరీషాలను ఎన్నుకున్నారు.

ఇటుకబట్టీల సంఘం అధ్యక్షుడిగా మల్లయ్య

మంచిర్యాలటౌన్: ఇటుక బట్టీల సంఘం మంచి ర్యాల గౌరవ అధ్యక్షుడిగా పాతమంచిర్యాలకు చెందిన చింతకింది మల్లయ్యను సభ్యులు ఆదివారం ఎన్నుకున్నారు. సంఘ సభ్యులు మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావును కలిసి వారి సమస్యలను విన్నవించారు.

మమత నూతన కార్యవర్గం ఎన్నిక

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మహిళా తరంగిణి(మమత) నూతన కార్యవర్గాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రమాదేవి, ఉపాధ్యక్షురాలిగా లత, ముఖ్య కార్యదర్శిగా శృతి, సంయుక్త కార్యదర్శిగా భాగ్యలక్ష్మి, కోశాధికారిగా కరుణను ఎన్నుకున్నారు.

పోచమ్మకు పూజలు

మంచిర్యాలఅర్బన్: పోచమ్మ ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. హమాలీవాడ పోచమ్మ ఆలయానికి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కోళ్లు, మేకలతో పాటు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల: సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి: సంపత్ - 7036227114
చెన్నూర్: సంపత్‌కుమార్ - 9949708989
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899